క్లుప్తంగా

వైభవంగా మందాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వడలి గ్రామ దేవత మందాలమ్మ

పెనుగొండ : వడలి గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం కనుల పండుగగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



పాఠశాలలో మాక్ డ్రిల్ చేస్తున్న ఫైర్ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం నాల్గవ రోజు పోడూరు మండలం జిన్నూరు విద్యాసంస్థలో అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. భారతీయ విద్యాభవన్స్ గ్రీస్ ఫీల్డ్ స్కూల్, జిన్నూరులో విద్యార్థులకు అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పెద్ద పెద్ద భవనాలు, మాల్స్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ద్వారా ప్రమాదం సంభవిస్తే ఏ విధంగా నిర్మూలించాలి, ఎలా బయటపడాలో డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకిరామ్, ఫైర్ సిబ్బంది, స్కూల్ డైరెక్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ జి.పద్మకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఇండియాతో ఎస్ఆర్‌కేఆర్ ఒప్పందం



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన, ఉన్నత విద్యారంగంలో అవకాశాలు మెరుగుపరిచేందుకు అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమం (ఐడీపీ) ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుందని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. ఐడీపీ సీనియర్ ఏరియా మేనేజర్ పి.అనిల్ కుమార్‌కు సోమవారం ఒప్పంద పత్రాలను అందించారు. కళాశాల విదేశీ భాషా విభాగం అధిపతి బీహెచ్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ ఇతర దేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు అంతర్జాతీయ ఇంగ్లిష్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, దీనికి ఐఈఎల్‌టీఎస్ పరీక్ష తమ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు ఐడీపీ సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. పరీక్ష మెటీరియల్ తీసుకొని అవసరమైన శిక్షణ కూడా ఫారెన్ లాంగ్వేజెస్ విభాగంతో పొందవచ్చని, ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఐఈఎల్టీఎస్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.చైతన్య, కళాశాల ఐఈఎల్ టీఎస్ కోఆర్డినేటర్ రమేష్ విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

18 మందికి ఉద్యోగాలు

కోర్ గ్రూప్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి వేతనంతో వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు అన్నారు. జిందాల్ స్టీల్స్ సంస్థలో రూ.6.5 లక్షల వార్షిక వేతనంతో గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజినీర్స్‌గా ఉద్యోగాలు పొందిన కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన 18 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులను సోమవారం అభినందించారు. ఆ వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌కు చెందిన 11 మంది, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి నలుగురు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, అధ్యాపకులు కె.ఆర్ సత్యనారాయణ, జీవీఎస్ పద్మారావు, కె.బ్రహ్మరాజు, బీఆర్‌కే వర్మ, డి.వెంకటపతి రాజు అభినందించారు.

జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన



పెదగరువులో నవరత్నాల పథకాలపై సర్వే చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్



జగన్నాథపురంలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న నాయకులు

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జిల్లా పరిషత్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పెదగరువులో సోమవారం జగనన్న మా భవిష్యత్‌లో కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. నవరత్నాల వలన ప్రజలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పెదగరువులో మంచినీటికి ఇబ్బంది పడుతున్నామని కందికట్ల సుగుణ అనే వృద్ధురాలు ఈ సందర్భంగా జెడ్పీచైర్మన్ శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చింది. దీంతో ఆయన స్పందించి మునిసిపల్ డీఈకి ఫోన్ చేసి ప్రతి రోజు ట్యాంకర్ ద్వారా మంచినీరు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. ఆయన వెంట ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, మండల సచివాలయాల కన్వీనర్ పార్సి వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా ఇర్మియారాజు, పార్టీ నాయకులు నల్లి నాగరాజు, ఊటాల చిట్టిరాజు, దుక్కిపాటి శ్రీనివాస్, బొంతు విజయప్రసాద్, రావి భాస్కరరావు, భూపతి సుధీర్, అంబేద్కర్, ఏడుకొండలు, ఊటాల రోజా తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

మొగల్తూరు : పేదల సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని నాయకులు పేర్కొంటున్నారు. జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు మండలంలోని 21 సచివాలయాల పరిధిలో ఇంటింటా సర్వే చేశారు. జగన్నాథపురం గ్రామంలో జెడ్పీటీసీ తిరుమాని బాపూజి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లు అందిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అర్హులకు సంక్షేమ లబ్ధి

పోడూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రావిపాడు సర్పంచ్ పెన్మెత్స విజయలక్ష్మి అన్నారు. రావిపాడు గ్రామంలో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ విజయలక్ష్మి, సచివాలయ కన్వీనర్ అందే నాగేశ్వరరావు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ పర్యటించి జగనన్న పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ప్రజల ఆమోదం మేరకు స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా కో కన్వీనర్ కేతా వెంకటేశ్వరరావు, వీవర్స్ సొసైటీ అధ్యక్షులు వాసా చంద్రశేఖర్, గృహ సారథులు వీరా మల్లికార్జునుడు, పెచ్చెట్టి నాగేంద్ర వరప్రసాద్, అందే సతీష్, వాసా పాండురంగా తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమం

యలమంచిలి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజలంతా మరోసారి రాజన్న బిడ్డ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్నారెడ్డి కోరారు. మండలంలోని కాంభొట్లపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో కలసి ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది, సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా అంటూ ప్రజలను అడిగి సమాధానాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు మందా హరికుమార్, శీలం వీరబాబు, అనిశెట్టి ధర్మారావు, శీలం చంద్రకళ, అంతర్వేది సీతారాముడు, అనిశెట్టి గంగన్న, బండి శ్రీను, యాండ్ర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌బాబు చల్లగా ఉండాలి



జగన్ ఫొటోను ముద్దాడుతున్న వృద్ధురాలు

పాలకొల్లు అర్బన్ : నా భర్తకు పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకోగానే వచ్చేసింది. నాకు వైఎస్సార్ చేయూతలో రూ.18750, వైఎస్సార్ ఆసరాలో రుణమాఫీ, నా మనవడు ప్రభాస్‌కి అమ్మ ఒడి డబ్బులు వచ్చాయ్. మాకు ఇంత మేలు చేసిన జగన్ బాబు చల్లగా ఉండాలి అంటూ పాలకొల్లు మండలం పెదగరువుకి చెందిన వృద్ధురాలు భూపతి నాగవేణి ఆశీర్వదించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను ముద్దాడుతూ మురిసిపోయింది.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

పెనుగొండ : నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలోనూ జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. సోమవారం పెనుగొండ మండలంలోని పెనుగొండ, వెలికట్రామపురం, వడలి, రామన్నపాలెం, సిద్ధాంతం, తామరాడ, మునమర్రు, దేవ, కొఠాలపర్రుల్లో, ఆచంట మండలంలో ఆచంట, శేషమ్మ చెరువు, కొడమంచిలి, ఆచంట వేమవరం, కోడేరు, భీమలాపురం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.



రావిపాడులో బ్రోచర్‌ను అందిస్తున్న దృశ్యం



యలమంచిలి కాంభొట్లపాలెంలో సర్వే నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



తామరాడలో కరపత్రాన్ని అందిస్తున్న సర్పంచ్, ఏఎంసీ డైరెక్టర్

నేడు అపుస్మా సర్వసభ్య సమావేశం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అపుస్మా సభ్యులు

పాలకొల్లు సెంట్రల్ : అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 9 గంటలకు లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు అపుస్మా జిల్లా అధ్యక్షుడు నిమ్మల పాపారావు నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో కూడా క్వాలిటీ ఎడ్యుకేషన్ అందిస్తున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లా కాకుండా సేవా దృక్పథంతో అపుస్మా విద్యా సంస్థలు ఎడ్యుకేషన్‌ను అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి అనుసంధానంగా అనుసరిస్తున్న అపుస్మా విద్యా సంస్థల ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికచేయాలని, అలాగే పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన అపుస్మా విద్యార్థులకు కూడా అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి పలు అంశాలపై సర్వసభ్య సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అపుస్మా సభ్యులు మద్దాల రాంప్రసాద్, రావూరి అప్పారావు, కేవీ కృష్ణవర్మ, మద్దాల వాసు, ఐడియల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ



పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్న అంజుమన్ పెద్దలు

నరసాపురం : ఇతరులకు సాయపడమని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోమని ఇస్లాం ప్రబోధిస్తుందని నరసాపురం అజుమన్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బులిమస్తాన్, కార్యదర్శి ఎండీ దావూద్‌ఖాన్ అన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంజుమన్ బిల్డింగ్‌లో 650 మంది ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బులిమస్తాన్, దావూద్‌ఖాన్ మాట్లాడుతూ అంజుమన్ సంస్థ ద్వారా గత 30 ఏళ్లుగా ప్రతి ఏటా రంజాన్ మాసంలో పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే సంస్థ ద్వారా ఏడాది పొడవునా అవసరం మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రంజాన్ విశిష్టతను ప్రతి ముస్లిం సోదరుడు తెలుసుకోవాలని, అందరూ సంతోషంగా మెలగడమే రంజాన్ పండుగ ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎండీ మౌలాలీఖాన్, ఎండీ వలీ, బషీర్, ఇంతియాజ్, ఆలీషా పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాష్ట్ర కమిటీ నాయకులు

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు మండల సకల కళాకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో జరిగిన రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శలా కోటి వీరయ్య, దువ్వి రామారావు ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా కడలి నాగ వెంకట దుర్గాప్రసాద్, అధ్యక్షురాలిగా కొవ్వూరి శ్రీనివాస రాణి, ఉపాధ్యక్షుడుగా అంబటి పెద వెంకట్రాజు, ప్రధాన కార్యదర్శిగా తాళ్లకోటి నరసింహ మూర్తి లింగం, కోశాధికారిగా వంగా శేషారావు, సహాయ కార్యదర్శులుగా తమ్మా శివకోటి మార్లింగం, పీడీఏజీ రత్నం (ధనలక్ష్మి), సభ్యులుగా కడలి వెంకట సుబ్బారావు, చిట్టూరి శ్రీనివాసరావు, దంపనబోయిన శ్రీనివాసరావు, కాకుల రాజు, రాపాక దైవ సహాయం, దొంగ సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ఇసుక లారీల సీజ్

కాళ్ల: ఏలూరు జిల్లా వెంకటాపురం నుంచి అనుమతుల్లేకుండా పెద్ద ఎత్తున బొండు ఇసుక తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసినట్టు కాళ్ల పోలీసులు సోమవారం తెలిపారు. ఏలూరు జిల్లాతో పాటు మండలంలో పెద్ద ఎత్తున బొండు ఇసుక వ్యాపారం సాగుతుంది. ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది దృష్ట్యా ఆకివీడు సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అక్రమంగా బొండు ఇసుక తరలిస్తున్న ఆరు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి



సమస్యలు వింటున్న నరసాపురం సబ్‌కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం : స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులపై అధికారులు తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు మొత్తం 41 ఫిర్యాదులు అందించినట్టు సబ్‌కలెక్టర్ చెప్పారు. హౌసింగ్, భూతగాదాలు, భూ సమస్య, రేషన్ కార్డులు, పింఛన్‌లు తదితర అంశాలపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని సత్వరం పరిష్కరించాలనే ఉద్దేశంతో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అధికారులు స్పందన ఫిర్యాదులు ఎంతమేర పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం విషయంలో అశ్రద్ధగా ఉంటే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులు, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

యలమంచిలి : రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజకు మద్దతు ధర ఇవ్వడం కోసమే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని యలమంచిలి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చివటపు నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట కోతకు వచ్చే దశలో రైతులు రైతు భరోసా కేంద్రానికి వచ్చి సమాచారం ఇవ్వాలని కోరారు. వ్యవసాయ సహాయకులు మీ చేను వద్దకు వచ్చి ఏ రోజు మీ ధాన్యం తీసుకెళ్లేది చెప్తారన్నారు. ఆ విధంగా ధాన్యం తీసుకెళ్లిన 21 రోజుల్లో ధాన్యం డబ్బులతో పాటు గోనె సంచులు, కూలీలు, రవాణా చార్జీలను రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ తమ్మినీడి వీర వెంకట సత్యనారాయణ ప్రసాద్ (బుజ్జి), గ్రామ వ్యవసాయ సహాయకురాలు స్వప్న రైతులు కాసా రామాంజనేయులు, బొప్పన సత్యనారాయణ, కొడవటి అంజనేయులు, కాసా పుష్ప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రధానోపాధ్యాయులకు పూలే అవార్డు



పూలే అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్

మొగల్తూరు : మండలంలోని ఇద్దరు ప్రధానోపాధ్యాయులు మహాత్మా జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపికయ్యారు. వారతిప్ప ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సూర్యప్రకాష్, రామన్నపాలెం పంచాయతీ లక్కువారితోట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.బుజ్జిబాబు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం తిరుపతిలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రాంగణంలో పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు ఈ అవార్డులను అందుకున్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్, మహిళా ప్రధాన కార్యదర్శి ఎం.వరలక్ష్మి, పి.రవి తదితరులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు సూర్యప్రకాష్ తెలిపారు.

18న భీమవరంలో ఇఫ్తార్ విందు

భీమవరం(ప్రకాశం చౌక్): రంజాన్ సందర్భంగా స్థానిక టౌన్ హాల్లో 18వ తేదీ సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని మసీదు కమిటీ పెద్దలు, ముస్లింలు హాజరు కావాలని కోరారు.

నేడు కెరీర్ గైడెన్స్ కోర్సులపై అవగాహన సదస్సు

నరసాపురం : పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు మంగళవారం పట్టణంలోని శ్రీసూర్యా కళాశాలలో ఐఐటీ, నీట్, వివిధ కెరీర్ గైడెన్స్ కోర్సులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. నిష్ణాతులైన అధ్యాపకులచే ఉదయం 9 గంటలకు అవగాహన సదస్సు ప్రారంభమవుతుందన్నారు. అలాగే పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు తమ కళాశాలలో ప్రతి రోజూ ఫౌండేషన్ క్లాసులు సీనియర్ అధ్యాపకులచే నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

46 మందికి గుండె పరీక్షలు

పెనుగొండ : విజయవాడ డాక్టర్ వైవీరావు ఉషా కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం మునమర్రు పంచాయతీ కార్యాలయంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ తోట వెంకట సత్యనాగరత్నం ప్రారంభించారు. 46 మందికి గుండె వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు మామిడాల వెంకటేశ్వరరావు, ధరణాల సూర్యనారాయణ, అడ్డగళ్ల మెహర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

మొగల్తూరు : జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం మొగల్తూరు నాలుగు సచివాలయాల పరిధిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గంటా సుబ్బారావు, వీఆర్వో వెంకటలక్ష్మి, సిబ్బంది శ్రీను, మోహన్ పాల్గొన్నారు.

రావి, వేపచెట్లకు కల్యాణం



వేప, రావిచెట్లకు కల్యాణం నిర్వహించిన దృశ్యం

పాలకొల్లు సెంట్రల్ : స్థానిక యడ్లబజారు సెంటర్ కనకదుర్గమ్మ ఆలయం ఎదురుగా ఉన్న రావి, వేప చెట్లకు అశ్వర్థనారాయణ కల్యాణం సోమవారం నిర్వహించారు. పండితులు భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో కుప్పిలి ధర్మాచార్యులు, విజయలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మాచార్యులు మాట్లాడుతూ తాము కొన్నేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని ఇంటి ముందు కలిసి పెరిగిన రావి, వేప చెట్లకు కల్యాణం చేయాలని సంకల్పించి గత 18 ఏళ్లుగా చైత్ర బహుళ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణం చేస్తున్నామని తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం, అన్నదానం ఏర్పాటుచేశారు. కుప్పిలి శ్రీను, దుర్గ, వెంకన్న, నాగమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగు మేలు

పాలకోడేరు: పంటకు పంటకు మధ్య కాలంలో నవధాన్యాలు పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని వ్యవసాయ శాఖ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ అరుణ కుమారి పేర్కొన్నారు. బంటుమిల్లిలో సోమవారం ఏర్పాటుచేసిన మహిళా సంఘాలు, రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పచ్చి రొట్టలు సాగు చేయడం వల్ల నేల గుల్లబారి, వానపాములు అభివృద్ధి చెందుతాయని, నీటి సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. పశువులకు గ్రాసం పచ్చి మేతగా ఉంటుందన్నారు. జీవ వైవిధ్యం పెరుగుతుందని, చీడ పీడలు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జి స్వామి, మండల ఇన్‌చార్జి రవికుమార్ మహిళా సంఘాల సభ్యులు రైతులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేతో రైతులకు మేలు

భీమవరం అర్బన్: రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని సర్వే ఆఫ్ ఇండియా టీమ్ డ్రోన్ పైలెట్ వి.ప్రసాద్ అన్నారు. భీమవరం మండలం తోకతిప్ప గ్రామంలో సోమవారం డ్రోన్‌తో భూములు రీ సర్వే చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పొలాల వద్ద సర్వే నెంబర్లు తెలియక, రికార్డుల్లో భూ వివరాలు ఒకలాగా, క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం తక్కువ ఎక్కువలు ఉండటంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రోవర్ పరికరాల ద్వారా ఖచ్చితత్వంతో సర్వే చేసి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులందరూ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.నాగబాబు, సర్పంచ్‌లు తిరుమాని శ్రీను, నాగిడి నారాయణస్వామి, తిరుమాని శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు బొమ్మిడి కొండరాజు, రామాని పండు, పంచాయతీ కార్యదర్శి కల్యాణి, వై. ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.